
వరద
CHANDRA
ర.చ.న

**అవలించకుండానే** పేగులు లెక్క పెట్టేయ గలడు భూపతి!

అడక్కుండానే తుపాకీ అందిచ్చెయ్యగలడు చలమయ్య.

భూపతి బాడీకి చలమయ్య గార్డు!

• • • •

మన దేశానికి స్వాతంత్ర్యం వచ్చాక జమీందారీ పోయి దర్జా, దర్పం తరిగి చెన్నారం గ్రామంలో భూపతికి మిగిలింది — పాతి కెకరాల పొలంమాత్రమే! ఆ వూళ్లో అంతకన్నా ఆస్తిపరుడు మరొకడు లేడు. అందుచేత భూపతి ఆ వూరికి కామందయ్యాడు. ఆరు గదుల డాబా ఉంది. వూళ్లో అన్నీ మట్టి మిద్దెలు, వూరి పాకలు కావటం వల్ల భూపతిని డాబా భూపతి అని కూడా పిలుస్తుంటారు! వో శుభోదయాన భూపతి మనసులో దివ్యమైన కోరిక మొలకెత్తింది! తను అర్జంటుగా, అవలీలగా పెద్ద భూస్వామి అయిపోవాలి! తెలివితేటలన్నీ ఉపయోగించి పద్ధతుల్ని అన్వేషించాడు. అయినా ఏదో అసంతృప్తి. ఎంతకీ ఆలోచనలు ఒక కొలిక్కి రాకపోవటంతో తన వెంట కుక్కలా తిరిగే గుర్నాథానికి కబురు చేశాడు భూపతి.

"నమస్కారం! దొరవారు కబురు చేశారట" అన్నాడు గుర్నాథం చేతులు నలుపుకుంటూ వచ్చి.

"కూర్చో." ఆసనం చూపించాడు భూపతి.

లోపల గర్వపడుతూ కూర్చున్నాడు గుర్నాథం— వినయంగా "సెలవివ్వండి" అంటూ!

"ఏం లేదోయ్! ఎదుగూ బొదుగూ లేని ఈ ఆస్తి ఉంది చూశావూ, నన్ను త్రిశంకు స్వర్గంలో ఉంచుతున్నదోయ్! మధ్యరకం మనుష్యులకి ఎందు లోనూ చోరవ ఉండదు. పరపతి ఉండదు. మనం బాగా ఎదగాలి — ఎదిగితేనే గాని దేన్నీ అందుకోలేం. అదీ సంగతి— నీ సలహాకోసం పిలవనంపాను" అని వాలుకుర్చీలో వెనక్కు వాలి సిగరెట్టు పెట్టె తీసుకున్నాడు భూపతి!

"తమ అభిప్రాయం కొంత వరకు అర్థమైంది. ఇంకాస్త స్పష్టంగా వివరిస్తే నాకు తోచిన మార్గం విన్నవించుకుంటాను."

"భూస్వామి అని బోర్డు తగిలించుకోకపోయినా హైదరాబాద్ దాకా మన పేరు మోగిపోవాలోయ్! భూస్వామి భూపతంటే మినిస్టర్లు కార్లేసుకొని రావాలి మనింటికి! మనం కాకితో కబురు పెడితే పెద్ద పెద్ద పన్లు జరిగిపోవా లక్కడ! ఈ బోడి పాతి కెకరాలతో, గ్రౌండు ఫ్లోరు డాబాతో ఎన్నేళ్ళేఁయ్! మన పేరు మన తాలూకా దాటి పోవటమే కష్టం. అదీ సంగతి."

గుర్నాథానికి కేసు విశదమైపోయింది.

"ప్రభువుల వారి ఆంతర్యం సంపూర్ణంగా విదితమైంది. మన వూళ్లో ఉన్న సుక్షేత్రంలో సగానికి పైచిలుకు మీ ఆధీనంలోకి రావాలి! రావాలంటే వస్తుందా? మనం కృషి చేసి తెచ్చుకోవాలి. ఆ పైన మన రాజ్యాన్ని విస్తరింప చేసుకోవచ్చు. అంతేగదా!" అన్నాడు గుర్నాథం బుర్రను మధించి.

"అది సరేనోయ్. నువ్వింత అఖండుడివే, వెధవలు నిన్ను నైరివాడంటా రెందుకూ?" అని నవ్వాడు భూపతి.

"మీరే అన్నారుగా వాళ్ళు వెధవలని." కిసుక్కున నవ్వాడు గుర్నాథంకూడా.

ఇద్దరూ కాసేపు జాయింటుగా నవ్వుకున్న తర్వాత —

"ఇహ నీకు రెండో పన్లేదు, గుర్నాథం! మన ఆశయాన్ని సాధించుకోవటానికి గట్టి ప్లాను తయారు చెయ్యి. పకడ్బందీగా ఉండాలి సుమా! ఇహ వెళ్ళు" అన్నాడు భూపతి కుర్చీలోంచి లేస్తూ.

"చిత్తం. అతి త్వరలో వివరాలు సమర్పించు కుంటా" అని వెనక్కు చూడకుండా బయటికి నడిచాడు గుర్నాథం.

అతని నడకలోని వూపును గమనించిన భూపతికి తన ఒళ్ళు తనకే బరువై పోతున్న ట్లనిపించింది.

• • • •

పట్టుమని పదేళ్ళు గడిచిపోలే దప్పటికి!

భూపతికి తుపాకి అవసర మొచ్చింది.

ఎందుకంటే —

పాతికెకరాల పొలం పదిరెట్లు పెరిగింది. డాబా మీద మూడంతస్తులు లేచాయి. ఇప్పుడు దాన్నం దరూ మేడ అంటున్నారు. అంతేగాక, దగ్గర్లో ఉన్న టవున్లో వో నాలుగు సినిమాహాళ్ళూ, అరడజను రైసు మిల్లులూ, రెండు డాల్ మిల్లులూ కూడా ఉన్నాయి. భూపతి మేడ అంటే నాగరిక విలాసాలకు ఆటపట్టని గుర్నాథం మొదలుకొని గురువులుదాకా లొట్టలేసేవాళ్ళే!

గురువులు ఎవరో కాదు! జిల్లా మొత్తాన్ని తన కనుసన్నల్లో నిలబెట్టుకున్న ప్రముఖ రాజకీయనేత. పదవులంటే గురువులుకు ఎలర్జీ. అందుకే పదవుల్ని బఠాణీల్లా శిష్యులకు పంచిపెట్టడానికే కంకణం కట్టుకున్నాడు. తన నీతి సూత్రాన్ని చాలాసార్లు భూపతికి కూడా ఉపదేశించాడు. భూపతి బుద్ధిమంతు డవటాన ఆస్తి, అంతస్తు, రాజకీయ ప్రాబల్యం, పోలీసుల్లో పలుకుబడి అన్నీ ఒకట్టొకటి ఎదిగిపోయాయి! అయితే, వాటన్నిటినీ మించి శత్రువుల సంఖ్య కూడా పెరిగిపోయింది. ఆ సత్యాన్ని భూపతి తొందర్లోనే గ్రహించాడు! అందుచేత ఆత్మరక్షణకు ఆయుధం లేకపోతే ఎలా?

ప్రమాదం ఎప్పుడైనా ముంచుకు రావచ్చు. అకస్మాత్తుగా జనం మీద పడవచ్చు. అప్పుడు పోలీసులకోసం అంగలారిస్తే ప్రయోజనముండదు. కబురు చేరటానికి, వాళ్ళు రావటానికి గంటసేపైనా పడుతుంది. ఈ లోపలే తనను ఖతం చేస్తే!

భూపతి పదునైన మెదడులో పసందయిన ఆలోచన మెరిసి కార్యరూపం దాల్చటానికి వారం పట్టలేదు. పూజా వగైరా సకల లాంఛనాలతో ఆయుధం ధరించాడు. దాని ప్రిస్టేజికి భంగం రాకుండా పై అంతస్తులో అమర్చాడు దాన్ని.

ఆ మరునాడే మరో సమస్య వచ్చి పడింది భూపతికి. అవశ్యమయంలో ఆయుధం చేపట్ట గలడు కాని వెళ్ళిన చోటుకల్లా మోసుకుపోవటం ఎలా? జనం నవ్వుతారు.

భూపతి వెంటనే గుర్నాథాన్ని పిలిపించాడు సలహా కోసం.

"రావయ్యా! గుర్నాథం,రా. తుపాకీ అయితే మనింటి కొచ్చింది. దాన్ని మొయ్యటానికి మనిషి కావాలి కదా!" అన్నాడు సాలోచనగా.

"భేషుగ్గా ఉంది మీ ఆలోచన. పొద్దాకా తుపాకీ భూజానేసుకుని తిరుగుతుంటే పిట్టల దొరకు మల్లే ఏం బాగుంటుంది? ఒక గాడీబార్డ్‌ను పెట్టు కోవాల్సిందే."

తన సలహాకు తిరుగు లేదన్నట్టుగా పోజు పెట్టాడు గుర్నాథం.

"ఒరి నీ బండబడ! గాడీబార్డ్ గాదయ్యా బాడీగార్డ్. బాడీగార్డ్ అనాలి. అదే మన నాయకుల కుంటారే అలా గన్నమాట! ఇప్పుడు వాళ్ళ కన్నా మనం మాత్రమేం తక్కువ? అదిసరే, మన వూళ్ళో ఈ పనికి తగిన వాడు ఎవడన్నా ఉన్నాడంటావా?" అడిగాడు భూపతి ముందుకు వంగి.

గుర్నాథం ఆలోచనలో పడ్డాడు.

రెండు నిమిషాల తరవాత "ఆఁ— దొరికాడు. కాని వాడీ పనికి ఒప్పుకుంటాడో లేదో!" అన్నాడు గుర్నాథం తల గోక్కుంటూ.

"దొరికాడన్నావు కదయ్యా! మళ్ళీ ఆ సందేహ మెందుకు? ఎవడు వాడు? మన వూరి వాడేనా?" ఆసక్తిగా అడిగాడు భూపతి.

"మన వూరి వాడేనండీ! చలమయ్య! కాస్త కండ గుండె కల బిడ్డడు. జనంలో వాడంటే మంచి గౌరవముంది. భయమూ ఉంది. వాడికి తిక్క రేగిం దంటే వంద మందైనా కాళ్ళకు బుద్ధి చెప్పాల్సిందే! వాడు కనకవుతే ఇహ మీకు చీకూ చింతా ఉండదు. చిక్కేమిటంటే, దేవుడు వాడికి అనవసరంగా తెలివి తేటలు ప్రసాదించాడు. పైగా కష్టజీవి. ఒక పది ఎకరాలు కౌలుకు తీసుకుని చెమటోడ్చి బతుకీడుస్తున్నాడు. వాడి భార్య మహా ఇల్లాలు. ఒక్కతే కూతురు వాడికి. స్వతంత్ర జీవనం చేస్తున్నాడు మరి ఈ..." అంటూ నసిగాడు గుర్నాథం.

"పనికి ఒప్పుకోడంటావు! ఈమాత్రం దానికి నువ్వుండి లాభమేమిటి? వాణ్ణి బోల్తా కొట్టించటంలో నీ నేర్పు చూపించు. గట్టిగా ఒప్పించు! వెంటనే పనిలో చేర్పించు! ఇహ ఫో."

మరో మాట లేకుండా లేచి చక్కా పోయాడు గుర్నాథం.

భూపతికి ఈ సారి తన కళ్ళు కూడా బరువెక్కి పోతున్న ట్లనిపించింది.

• • • •

భూపతి కొలువులో అయిదేళ్ళు పూర్తి చేసిన చలమయ్య ఒక రోజు పొద్దున్నే చేతులు కట్టుకుని నిలబడ్డాడు.

"ఏమిట్రా, ఏదో అడగాలనుకుంటున్నావు?" అన్నాడు భూపతి కాళ్ళు జాపి ముందున్న స్టూలు మీదికి చేరుస్తూ.

"ఏం లేదయ్యా. ఒక విషయం మీతో మనవి చేసుకుందామనీ" అంటూ నసిగాడు చలమయ్య.

"అదేదో తొందరగా చెప్పు." కసురుకున్నాడు భూపతి.

"ఆః— రేపటి నుంచీ ఈ కొలువు మానేద్దామను కుంటుండనయ్యా!"

"ఏం రోగ మొచ్చింది?"


"రోగమేం రానేదు. మా పిల్ల పెళ్లి సేద్దామను కుంటున్నా నయ్యా!"

"దానికీ దీనికీ ఏం సంబంధంరా?"

"ఉండదయ్యా! ఈడ ఎన్నాల్లు సాకిరీ సేసినా మా బతుకుల్లో సుకం నేకపాయె! మీా రిచ్చే గింజలు తింటానికే సరిపోతుండ్లై. సిల్లిగవ్వ ఎనకెయ్య లేక పోతుంటి. అందుకనీ...మల్లా ఓరి పొలమున్నా కొలుకు సేసుకుంటా పిల్లదాన్ని ఒ అయ్య సేతిలో పెడదా మని" అన్నాడు చలమయ్య.

ఆ మాటలతో భూపతి గుండెలో విషం చేరింది. వికటంగా నవ్వాడు.

చలమయ్యకు భూపతి భావం అర్థం కాలేదు.




"ఒరేయ్, చలమయ్యా! మీా ఇంటి చరిత్ర నీ కసలు తెలుసునా అని? నీ తాత చేసిన అప్పుకి వాడూ, మీా అయ్యా చచ్చేదాకా మా అడుగులకు మడుగు లొత్తుతూ విశ్వాసంతో బతికారు. అయినా అప్పు తీరలేదు. అందుచేత నువ్వుకూడా నా కాళ్ళ దగ్గర పడుండక తప్పదు!" అంటూ గర్జించాడు భూపతి.

"రెండు తరాలు సచ్చేదాకా వూడిగం సేసారంటు న్నారు గందా! మా తాతగారు సేసిన బాకీ తీరనే దంటారేంటి? ఒకేల తీరనే నేదనుకుందాం. మరి మా అయ్య నన్ను సిన్నతనం నుంచే మీా కాళ్ళ కాడ సడియ్య నేదే! అంటే మీా బాకీ సెల్లయి పోయినా దన్న మాట!" అంటూ చలమయ్య చేతులు దులుపుకున్నాడు.

"నాయాల్ది! వ్యవహారం ముదిరిందే. ఈ వూర్లో నీకు పొలం ఎవడు కవులు కిస్తాడో, పిల్ల పెళ్ళి ఎట్లా చేస్తావో నేను చూస్తా! నన్ను కాదని ఎవడ్రా ఈ వూర్లో బతికి బట్ట కట్టేది!" మీాసం దువ్వటంలోనే అహంకారం ప్రదర్శిస్తూ చరచరా లోపలికి వెళ్ళిపోయాడు భూపతి.

'అమ్మ దొంగనా కొడకా!' అనుకున్నాడు చలమయ్య. కళ్ళెర్ర బడ్డాయి! పిడికిళ్ళు బిగుసుకు పోయాయి! రక్తం సలసల కాగింది. ఆ రోజు గుర్నాథంగారి వల్ల ఎంత దగా పడ్డాడు తను!

ఆ రోజు...

"ఏరా, చలమయ్యా! కులాసానా?" కుంటు కుంటూ వచ్చాడు గుర్నాథం.

"ఆః—ఏం కులాసాలే, బాబూ! ఈ మట్టిని నమ్ము కుని రెక్కలు ముక్కలు సేసుకుంటుండా—వారానికి రెండ్రోజులు పొయ్యిలో పిల్లి లేవనంటుండాది." కలుపు తీస్తున్న చలమయ్య చెమట తుడుచుకుంటూ గట్టుమీాది కెళ్ళాడు.

"అంతే మరి! పరాయి వాళ్ళ పొలంలో ఎంత కష్టపడ్తే మాత్రం ఏం లాభ ముంటుంది? సొంత పొలమున్నా ఉండాలి, లేకపోతే సుఖంగా ఉండే కొలు వన్నా చూసుకోవాలి" అన్నాడు గుర్నాథం లౌక్యంగా.

"ఈ రోజుల్లో అట్టాటి కొలువు లేడ దొర్కుతై, పంతులూ, నీ పిచ్చిగానీ!" చలమయ్య నిట్టూర్చాడు.

"నువ్వు వూః ... అను. నేను ఏర్పాటుచేస్తా." ఏదో రహస్యం చెపుతున్నట్టు గొణిగాడు గుర్నాథం.

"కష్టం సెయ్యకుండా కూకొని తింటే మటుకు అరగొద్దూ, పంతులూ!"

"నేను చెప్పినట్టు విన్నావంటే, చేతులకు మట్టంటకుండా హాయిగా నీటుగా బతకొచ్చు." మాటలతో వూరిస్తున్నాడు గుర్నాథం.

"సేతులకు మట్టంటకుండా అంటే దొంగ తనాలు సెయ్యమంటా వేంటి, సామీా!" అన్నాడు చలమయ్య పేలవంగా నవ్వుతూ.

"చ చ ... అటువంటివి చేయమని నే న్జెప్తానా? హాస్యం గాదురా, చెలమయ్యా! నేను నిజమే చెపు తున్నాను. నీకు నమ్మకం లేదంటావా నే నెళ్ళిపోతా" అంటూ రెండడుగులు కదిలాడు గుర్నాథం.

"అరె ...రె ... ఉండవయ్యా, పంతులూ. ఏం టట్టా అలిగి ఎల్లిపోతుండావు! సెప్పదల్సు కుందేదో సెప్పే ఎల్లు" అన్నాడు చలమయ్య తానూ కదులుతూ.

"మన భూపతిగారి దగ్గర ఒక గ్రాండైన ఉద్యోగం ఉంది. నీ ఇష్టమైతే వేయించేస్తాను" అంటూ చిటికె లేశాడు గుర్నాథం.

"సెయ్యాల్సిన పనేటో సెప్పక మల్లీ ఆగి పోనా వేంటయ్యా, పంతులూ!"

"వస్తున్నా... వస్తున్నా. అక్కడ నీకు తగిన పనే ఉంది. ఆయన తుపాకీ మోస్తూ బాడీగార్డ్‌గా ఉండాలి.అంతే.నీకుటుంబానికి సరిపోయే తిండిగింజలకి ఢోకా ఉండదు. వస్తులుండటం తప్పుతుంది. మరి ఆలోచించు" అని చుట్ట వెలిగించాడు గుర్నాథం.

"తుపాకీ పట్టుకుని ... అదేంటి ...బా...డీ...గా అన్నారు! అంటే ఏటండీ?" అన్నాడు చలమయ్య అర్థం కానట్టు చూస్తూ.

"బాడీగార్డంటే — నువ్వెప్పుడూ అయ్యగారి వెంట ఉండాలన్న మాట! ఎవడైనా ఆయన జోలికి వస్తే వాడికి దేహశుద్ధి చెయ్యాలి నువ్వు! అదును కనిపెట్టి తుపాకీ ఆయన చేతి కందియ్యాలి! అంతే" అన్నాడు గుర్నాథం, చలమయ్య ముఖంలోకి ఆశగా చూస్తూ.

"మీారు సెప్పింది బాగానే ఉండది. కానీ ఇందులో ఏం తిరకాసు నేదుకదా!" అనుమానంగా అడిగాడు చలమయ్య.

"తిరకాసు లేదు! నీ బొందా లేదు! ఏదో నీ మీాదున్న అభిమానం కొద్దీ ఈ పాటి సహాయం చేస్తున్నాను. అంతేగాని మరొకటి కాదు." అనుమానం నివృత్తి చేశాడు గుర్నాథం.

"ఈ పాటి పనికి నన్నే ఎందు కెంచుకున్నారని" మళ్ళీ సందేహం వెలిబుచ్చాడు చలమయ్య.

"మన వూర్లో నీ పాటి గుండె, కండ గలవాడు ఇంకోడు లేడు గాబట్టి! నువ్వు భూపతిగారి పక్కన నిలబడితే, శ్రీరామచంద్రుని పక్కన లక్ష్మణస్వామి లాగా ఉంటా వనుకో! ఎంత గౌరవం నీకు! వెంటనే పనిలో చేరి భేషనిపించుకో!" హితబోధ చేసి వెళ్ళి పోయాడు గుర్నాథం.

అప్పుడు తన తెలివేమయ్యె! ఒళ్ళొంచి కష్టపడే తను ఆ పనికి ఎట్లా కక్కుర్తి పడ్డాడని! మంచి శిక్షే పడింది తనకు. ఛి ... ఛి ... ఎంత నీచప్పని చేశాడు! ఎంత రోసిపోయింది బ్రతుకీనాడు! తన గుండెకు దెబ్బ తగిలింది కాబట్టి భూపతి దుర్మార్గం తెలిసొచ్చిందా? లేదు ... లేదు! వాడి దుర్మార్గానికి బలైనోళ్ళు తమ వూరి రైతుల్లో మూడొంతుల మంది ఉన్నారు. వాడి రాక్షస వడ్డీలు కట్టలేక పొలాలు పోగొట్టుకొని, వాడి కింద కూలీలుగా బతుకు తున్నారు! వాళ్ళ కన్యాయం జరుగుతుంటే తను చూస్తూ వూరుకోలేదూ!

దుఃఖం, కసి, నిస్సహాయత ముప్పిరి గొంటుంటే అక్కడే చతికిలబడి కూర్చున్నాడు చలమయ్య. నాగటి

క్రరను కొలిమిలో కాల్చి సంపెటతో సాగగొడుతున్నట్టుగా శరీరమంతా సెగలెత్తిపోతోంది. గుండెలోకి జారుతున్న కన్నీళ్ళు నెత్తురుగా మారి కళ్ళలోకి ఎగసి పడుతున్నాయి.

దగాపడిన తమ్ముళ్ళ ఆకలి చూపులు, ఎండు డొక్కలు చలమయ్య మనసు తెరపైన దృశ్యం కట్టింది. కూలదోస్తున్న నీరసాన్నే శక్తిగా చేసుకొని ఒక్క ఉదుటున లేచాడు.

• • • •

నెల రోజుల తర్వాత ఓ రాత్రి సరిగ్గా పన్నెండు గంటల సమయం! చెన్నారం చీకటి గుహలో నిద్రపోతున్న సింహంలా మాటుమణిగి ఉంది. అప్పటికి నాలుగు రోజులుగా కురుస్తున్న వాన తాకిడికి కరెంటు తీగెలు తెగిపోయాయి. అప్పుడే కాస్త వర్షం వెనకపట్టింది.

"చలమయ్యా! ... చలమయ్యా! ..." అంటూ గుడిసె తలుపు బాదింది సావిత్రి.

నిద్ర మత్తులో ఉన్న చలమయ్య కలవరపడుతూ, లేచి తలుపు తీశాడు. చంకలో పసికందు నెత్తుకుని రొప్పుతూ, రోదిస్తూ ఉన్న సావిత్రిని చూసి—. "ఏందక్కా! ఈయాల్టప్పుడు వచ్చినావ్?" అన్నాడు కంగారుగా.

"అరేయ్, తమ్ముడూ! మీ బావని భూపతిగాడి మడుసులొచ్చి గుంజక పోయిన్రు! ఆయ న్నాడ ఏం చేస్తర్రో, ఏందో!" అంటూ భోరున ఏడవసాగింది సావిత్రి.

ఆ గొడవకి చలమయ్య భార్య, కూతురు రివ్వున బయటికొచ్చారు.

"అక్కా! నువ్వేం బెంగట్టుకోమాకే! నా బొందిలో ప్రానముండగా బావకేం ఆపదా రానియ్యను. ఇప్పుడే మనోళ్లందర్నీ పోగుసేసుకొని ఎల్తా" అని విసురుగా లోపలి కెళ్ళి ముల్లుగ్రరతో పరుగెత్తుకుంటూ వూళ్లో కెళ్ళిపోయాడు చలమయ్య, కట్టలు తెంచుకొని వెల్లువలా పొంగుతున్న ఆవేశంతో.

అరగంటైనా దాటకుండానే భూపతి మేడ ఆవరణ జనంతో సముద్రంలోని దీవిలా మారిపోయింది.

"ఏరోయ్, పెద్దోడా! వూరంతా కట్టగట్టుకొని దిగబడ్డారు" అంటూ గుర్నాథం జనానికి అడ్డంగా నిలబడ్డాడు.

"ఇదిగో, కుంటాయనా! అడ్డొచ్చినావంటే ముందు నీ బుర్ర రామకీర్తన పాడుద్ది! ఏం బతుకురా నీది? కుక్కనాయాల— థూ ..." పెద్దయ్య కాండ్రించి ఉమ్మేశాడు.

"ఏరా! మహా కావరం పోతున్నావు! బతుకుమీద ఆశ లేదేమిటి?" పంచ సవరించుకుంటూ వెనక్కి జరిగాడు గుర్నాథం.

"అరేయ్, చలమయ్యా! పదండ్రా లోనకి. ఎవడడ్డమొస్తాడో చూస్తా! అరేయ్, సింగడూ —ఈ పంతుల్ని లాగవతల పార్నాకు" అని పెద్దయ్య ముందుకు దూకటమే తడవు పాలోమని జనమంతా దూసుకు వెళ్ళారు.

వెంకటేశాన్ని పెడరెక్కలు విరిచి, వేపచెట్టుకు కట్టేసి సీమదున్నల్లాంటి నలుగురు మనుషులు కొరడాల్తో బాదుతున్నారు.

చెట్టుకు నాలు గడుగుల దూరంలో భూపతి...

"ఏరా! ఇప్పటికైనా నీ మంకు పట్టు వదుల్తే బతికి పోతావు! లేదా పొద్దు పొడిచే టప్పటికి నీ ఇంటికి శవమే పోతుంది! అనవసరంగా కొరివితో తల గోక్కుంటున్నావు" అంటూ ఫెడేలుమని వెంకటేశం చెంపమీద కొట్టాడు.

"ఆగు!" అన్న కేక సముద్ర హోరులా గురువులు, భూపతి చెవుల్లో సంచలనం రేపింది.

అయినా, నిదానంగానే కుర్చీలోంచి లేచి ఠీవిగా ముందుకు కదుల్తూ — "ఏం? ఏం కావాలి? ఇంత రాత్రి మీరంతా ఎందుకొచ్చారిక్కడికి?" అని ప్రశ్నించాడు గురువులు.

"నువ్వెవరో మాకు తెలవదు! అడుగో — నీ పాటున నిల్చున్నడే ఆయన్నడగమను" అన్నాడు పెద్దయ్య నిర్లక్ష్యంగా.

"అరెయ్ ... రవుడీనాకొడకల్లారా! మా ఎంకటేశం ఒంటిమీద ఇంకో దెబ్బ పడిందో మీ పుర్రె లెగిరిపోతై! రాండ్రా ఇవతలికి!" అంటూ గర్జించాడు చలమయ్య.




"ఏరా, చెలమాయ్! నా ఇంటి మీదికి గుంపు వేసు కొస్తావురా? ఐదేళ్ళు నా తిండి తిని నా కెదురు నిలవటానికి ఎన్ని గుండెలురా నీకు?" అని గురువుల పక్కన చేరాడు భూపతి.

"నాకు మీరేం ఉత్తిపున్నానికే తిండి పెట్టనేదు. పొద్దాక నిన్ను కాసినా. బుద్దినేక నీ కొలువులో సేరినందుకు నా బతుకు అగమానమై పోవాది! మర్యాదగా మా ఎంకటేశాన్ని ఇడిసెయ్యండి" అన్నాడు చలమయ్య క్రర నేలను కొడుతూ.

"అవునయ్యా! మీ పెద్దోళ్లతోటి మాకు పంతా లేటికి? నే నూస్తుండగానే ఇంత గొప్పోడివై పోనావు! నీకు సెప్పేపాటి గ్యానం నేదు నాకు. అయినా సెబుతుండ! ఎంకటేశాన్ని ఇడిసిపెట్టు. నేకపోతే ఏమవుద్దో నీకు తెలవదు" అన్నాడు పెద్దయ్య హెచ్చరింపుగా.

"ఏం జేస్త్రరా? తల తీసి మొలేస్తారా? మీ మందను చూసి భయపడి నా మాట ఒప్పేసుకోండే వీడిని విడిచిపెట్టడం కల్ల. నా పంచన పడి ఉండాల్సిన ఈ చలమాయ్ పొగరెక్కి పని మానేశాడు! వాడికి పొలం కౌలుకిచ్చి ఈ వెంకటేశం గాడు నా కెదురు తిరుగుతాడా?" దర్పం తగ్గనివ్వలేదు భూపతి.

"ఆ మాట సెప్పటానికి నువ్వెవడి వంట— నా పొలం, నా ఇట్టం!" వెంకటేశం పౌరుషంగా అన్నాడు.

"అవునండీ! ఆడి పొలం, ఆడిట్టం! ఆడు నాయమే మాట్టాడుతుండాడు. ఆ మాటకొత్తే చలమయ్య మాత్రం మీకాడ ఎందుకు పడుండాల? ఆడేం మీకు బాకీ పడిండా? మీకాడి నుంచి తొలిగిరాటం నాయమే! మీరే ఇంత అన్యాయానికి దిగినారు!" అంటూ పెద్దయ్య భూపతికి దగ్గరగా పోయి నిలుచున్నాడు.

"న్యాయాన్యాయాలు తేల్చటానికి నువ్వెవడివిరా? భూపతి ఈ వూరి కామందు! ఆయన చెప్పిందే న్యాయం, చేసిందే ధర్మం! అందుచేత మీరంతా తోకలు ముడుచుకొని పోతారా సరి — లేదా దొమ్మీ కేసు బనాయించి బొక్కలో తోయిస్తా—జాగ్రత్త" అని గురువులు మెల్లగా తన మనుషుల దగ్గరికి జరిగాడు.

"నువ్వాగవయ్యా! నీ యవ్వ! కట్టకాలంలో తీసుకున్న అప్పుకి వడ్డీ మీన వడ్డీ కట్టి మా పొలాన్ని కాజేసిండు! రైతులందర్నీ కూలీలుగా మార్చిండు! పదియేనేండ్లనాడు ఈన కెంతుండాది? ఇయ్యాలెంతుండాది? ఇదంతా యాడ్ది? మా రగతం తాగినోడికి నువ్వత్తాసొచ్చినావు —పట్నం నుంచి! సిగ్గునేదూ సెప్పటానికి?" నరసయ్య గట్టిగానే దబాయించాడు.

"అరేయ్ ...! ఈ నా కొడుకుల్తో మాటలేంటి కంట! రా రా ... ఎంకటేశా!" అని చెట్టుదగ్గరికి పోయాడు సింగడు.

"ఎవడైనా మెసిల్నాడంటే ఈ క్రర దెబ్బకి పుట్టె కరవాల్సిందే!" అని గాండ్రించాడు చలమయ్య క్రర పైకెత్తి.

మరుక్షణంలో వందల క్రరలు ఆకాశాని కెగిశాయి!

తమవాణ్ణి విడిపించుకొని తరలి పోతున్న జన సమూహాన్ని చూస్తూ నిశ్చలంగా నిలుచుండిపోయిన గురువులు, అతని శిష్యులు భూపతి కనుసైగల్ని పట్టించుకోలేదు.

పరాభవ జ్వాలతో మనసు కుతకుత ఉడికి పోతుంటే, నిస్సారంగా చూస్తూండి పోయాడు భూపతి. *